ఈనాడు
epaper.eenadu.net

# పీపీపీ ప్రాజెక్టులకు సవాళ్లు అధికం

## హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో చేపట్టే ప్రాజెక్టులకు ఎన్నో సవాళ్లు ఉంటాయని.. వీటిని పర్యవేక్షించే ప్రభుత్వ అధికారులకు నిర్దిష్ట పదవీకాలం ఉండాలని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో గురువారం బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో 'పట్టణాభివృద్ధి-మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం' అంశంపై ఆయన మాట్లాడారు. నగరాల్లో ప్రభుత్వం సొంతంగా చేసే ప్రాజెక్టులతో పోలిస్తే ప్రైవేటు సంస్థలు చేసేటప్పుడు చాలా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాద్ మెట్రో మొదటిదశలో 6వేల చెట్లు తొలగించామని.. వాటిలో 2850 వేరే చోట నాటామని చెప్పారు. తొలగించిన ఒక చెట్టుకు బదులుగా 5 మొక్కలు నాటాల్సి ఉండగా.. హెచ్ఎంఆర్ 12 లక్షలు నాటిందన్నారు. అదే ప్రైవేటు సంస్థ అయితే ఒక చెట్టునూ తొలగించడం సాధ్యమయ్యేది కాదన్నారు. ప్రభుత్వంలో వేతనాలు, ప్రైవేటుతో పోలిస్తే తక్కువగా ఉంటాయని.. భారీ వేతన అవకాశాలు ఊరిస్తుంటాయని.. దీన్ని ఎలా ఎదుర్కోవాలనేది పీపీపీ ప్రాజెక్టుల్లో పెద్ద సవాల్‌గా మారిందన్నారు. నగరంలో మెట్రో ఒక్కటే పరిష్కారం కాదని పలురకాల రవాణా వ్యవస్థలు (మల్టీమోడల్ ట్రాన్సిట్) ఉండాలని.. ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ కీలకమని వివరించారు. దగ్గరి దూరాలను 15-20 నిమిషాల్లో చేరుకోగలిగితే మంచి రవాణా వ్యవస్థ ఉన్నట్లేనన్నారు. తాము మెట్రో చేపట్టినప్పుడు ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు 30 కి.మీ. పరిధిలో ఉన్న నగరం ఇప్పుడు అటు పటాన్‌చెరు, ఇటు హయత్‌నగర్ దాటి 60 కి.మీ.పైగా విస్తరించిందన్నారు. ఈ దూరాన్ని సిటీ లోపల నుంచి గంటలో చేరేలా ఏర్పాట్లు ఉంటే గొప్ప విజయంగా భావించాలన్నారు.

Date : 26/01/2024 EditionName : GREATER HYDERABAD PageNo :